
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

మంగళవారం 7 జనవరి 2025

వక్ఫ్ ఆస్తులపై సమగ్ర సర్వే చేపట్టండి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తులపై సమగ్ర సర్వే నిర్వహించి, రెవెన్యూ అధికారుల సమక్షంలో హద్దులు నిర్ణయించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ ఆస్తులు ఆక్రమణకు గురైతే, ఆక్రమణదారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. వక్ఫ్ భూములపై ఎటువంటి అనుమతులు ఇవ్వరాదని స్పష్టం చేశారు. సమావేశంలో డీపీవో కె.భారతి సౌజన్య, మైనార్టీ మెంబర్ జాన్, అబ్దుల్ సాదిక్, వక్ఫ్ ఆడిటర్ ఎండీ రియాజ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకల బోన్లనూ వదల్లే!



స్త్రీ శిశు సంక్షేమశాఖలో ఓ అధికారిణి అవినీతి కలకలం సృష్టిస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు విడుదలయ్యే నిధులను సొంతానికి వాడుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చివరకు పౌష్టికాహారం రక్షణ కోసం ఎలుకల బోన్లకు ప్రభుత్వం ఇచ్చిన నిధులు సైతం పక్కదారి పట్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు ఉద్యోగులు ఇటీవల ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్జేడీ స్థాయి అధికారి విచారణ చేపట్టారు.

- ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టించిన వైనం
- ఐసీడీఎస్‌లో ఓ అధికారిణి అవినీతి కలకలం
- అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు
- అక్రమాలపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదు
- గత నెల 31న గోప్యంగా ఆర్జేడీ విచారణ

రణస్థలం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా ఐసీడీఎస్ పరిధిలో 16 ప్రాజెక్టులు ఉన్నాయి. 16మంది సీడీపీవోలతో పాటు మండలానికి ఒకరు చొప్పున సూపర్‌వైజర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఇతర శాఖలో పనిచేసే ఓ అధికారిణిని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐసీడీఎస్‌లో నియమించారు. అప్పటి నుంచి ఆమె పండుగల సమయంలో బహుమతులు, నచ్చిన వస్తువులు ఇవ్వని వారిని టార్గెట్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం గత ఏడాది నవంబరు 13 నుంచి కిశోర వికాసం పథకాన్ని నిర్వహిస్తోంది. చదువుకు దూరంగా ఉండే 10 నుంచి 18 ఏళ్లలోపు 80 వేల మంది బాలికలకు శిక్షణనివ్వడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. దీనికిగాను 16 ఐసీడీఎస్‌ల పరిధిలో సీడీపీవోలు, అసిస్టెంట్ సీడీపీవోలకు శిక్షణ ఇచ్చారు. ఎంపిక చేసిన బాలికలకు జూనియర్ కాలేజీల స్థాయిలో పీటీజీలు శిక్షణ ఇస్తారు. పర్యవేక్షణ బాధ్యత సీడీపీవోలే చూస్తారు. ప్రభుత్వం ఒక్కో ప్రాజెక్టుకు రూ.50 వేల వరకు కేటాయించింది. జిల్లాలో మాత్రం ఓ అధికారిణి రూ.10 వేలు మాత్రమే అందించినట్లు సమాచారం. మిగతాది కిందిస్థాయి ఉద్యోగులు సర్దుబాటు చేసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది.

- గతంలో కూడా తల్లిపాల వారోత్సవాలు, పోషణ పక్వాడా, జగనన్న సురక్ష వంటి వాటికి ప్రభుత్వమే నిర్వహణ నిధులు విడుదల చేసేది. ఈ నిధుల్లో కూడా ఆమె చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- జిల్లాలో సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు 2023లో నిర్వహణ నిమిత్తం రూ.3000 చొప్పున మంజూరయ్యాయి. ఈ నిధులు సైతం ఆ అధికారిణి పక్కదారి పట్టించారన్న అభియోగాలు ఉన్నాయి. కేంద్రాల్లో పౌష్టికాహారం రక్షణ కోసం ప్రభుత్వం ఎలుకల బోన్లు అందించించిది. దీనికి సంబంధించి విడుదలైన నిధులు కేంద్రాలకు ఇవ్వాలి. కానీ ఆ అధికారిణి వాటిని సైతం పక్కదారి పట్టినట్టు ఆరోపణలున్నాయి.
- జిల్లాలో 16 ఐసీడీఎస్‌ల ప్రాజెక్టుల పరిధిలో 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఇటీవల కిశోర వికాసం పథకానికి సంబంధించి ఒక్కో ఐసీడీఎస్ ప్రాజెక్టుకు రూ.50వేలు చొప్పున కేటాయించింది. కాగా.. అధికారిణి ఇందులో రూ.10వేలు చొప్పున 1,60,000 మాత్రమే సీడీపీవోలకు అందజేశారు. ఈ నిధులతోనే కార్యక్రమం నిర్వహణ ఖర్చులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎలుకల బోన్లు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయితే ఒక్కో ఎలుక బోను సుమారు రూ.500 ఉంటుందని, జిల్లాలోని 3,358 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక్కోటి ఏర్పాటు చేసినా.. రూ.16,79,000 ఖర్చవుతోందని కొంతమంది ఉద్యోగులు

(మిగతా 6వ పేజీలో..)

మూడు రిజర్వాయర్లతో..

జలజీవన్ మిషన్

- ఇప్పటికే నీటి వనరుల గుర్తింపు
- వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం
- ప్రారంభించని రూ.600 కోట్ల విలువైన పనులు రద్దు

శ్రీకాకుళం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు రక్షితనీటిని సరఫరా చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రజలకు రక్షిత నీరందించేందుకుగానూ ఉమ్మడి జిల్లాలో హిరమండలం, తోటపల్లి, మడ్డువలస రిజర్వాయర్లను గుర్తించింది. ఈ మూడు రిజర్వాయర్లను జలజీవన్ పథకానికి అనుసంధానం చేసేలా అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. వేసవిలోనూ ప్రజలకు తలసరి రోజూ 55లీటర్ల నీరు సరఫరా చేసేలా పథకాన్ని పునర్వ్యవస్థీకరరించారు. రాష్ట్రవ్యాప్తంగా అంచనా వ్యయం దాదాపు రూ.60వేల కోట్లకు పెరిగే ఈ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం ఆమోదం తీసుకుని పనులు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా.. జలజీవన్ మిషన్‌పై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు పూర్తికాలేదు. రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో కేంద్ర నిధులనూ వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడింది. జలాశయాలకు బదులుగా బోర్ల ద్వారా నీటిని సేకరించి ప్రజలకు సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించారు. చాలాచోట్ల పనులు సక్రమంగా సాగక ప్రజలకు రక్షితనీటి సరఫరాకు ఇబ్బందులు తప్పలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో మూడు రిజర్వాయర్లను గుర్తించి.. కేంద్రప్రభుత్వానికి సమగ్ర నివేదికను పంపింది. ఉమ్మడి జిల్లాలో 38 మండలాల్లో అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి కొళాయిల ద్వారా తలసరి రోజూ 55 లీటర్లు చొప్పున రక్షితనీరు సరఫరా చేయాలన్నది లక్ష్యం. వేసవిలోనూ సరఫరాకు అంతరాయం లేకుండా ఈ మూడు రిజర్వాయర్ల నుంచి నీటిని సేకరిస్తారు. అంచనా వ్యయంపై కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో పనులు ప్రారంభించి.. 2028 నాటికి పూర్తిచేయనున్నారు.

జిల్లాలో 3,108 పనులు రద్దు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో సరైన ప్రణాళిక లేకుండా చేపట్టి, జిల్లాలో ఇప్పటికీ ప్రారంభించని రూ.600కోట్ల విలువైన 3,108 పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఇందులో టెండర్లకు నోచుకోని 2,583 పనులు, టెండర్లు పిలిచినా పనులు ప్రారంభించనవి 420, కనీసం 25శాతం కూడా పనులు జరగనివి 105 ఉన్నాయి. రద్దు చేసిన పనుల్లో బోర్లు ఆధారంగా నిర్వహించే సింగిల్, మల్టీవిలేజ్ తాగునీటి పథకాలే ఎక్కువ. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటితే బోర్లు సరిగా పనిచేయవన్న నిపుణుల సూచనతో ప్రభుత్వం పనులు రద్దు చేసింది. ప్రాజెక్టు వ్యయం పెరిగినా రిజర్వాయర్ల నుంచి నీటిని సేకరించి అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా చేసేలా ప్రభుత్వం కొత్తగా పనులు ప్రతిపాదించింది.



తోటపల్లి ప్రాజెక్టు (ఫైల్)



> ● ఒడిశాలోని సున్నాపూర్ బీచ్ ఇది. ఇచ్ఛాపురానికి కూతవేటు దూరంలో ఒడిశా భూ భాగంలో ఈ బీచ్ ఉంది. ఈ బీచ్‌ను గత ఐదేళ్లుగా ఒడిశా ప్రభుత్వం అభివృద్ధి చేసింది. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా కోట్లాది రూపాయలతో సదుపాయాలు కల్పించింది. కాటేజీలను కూడా ఏర్పాటు చేసింది. దీంతో ఉత్తరాంధ్ర పర్యాటకులు సైతం సున్నాపూర్ బీచ్‌కు వెళుతున్నారు.

సుదూర తీరం..

పర్యాటకం లేదాయె!

- పదుల సంఖ్యలో బీచ్‌లు ఉన్నా నిష్ఫలం
- ఉండడానికి నీడ, తాగేందుకు నీరు కరువు
- పొరుగునే ఒడిశాకు వెళ్తున్న పర్యాటకులు
- ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితమిది!

ఇచ్ఛాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సహజసిద్ధ మైన పర్యాటక ప్రాంతాలకు కొదువలేదు. వాటిని అభివృద్ధి చేస్తే పర్యాటక రంగం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అదే సమయంలో స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రాధాన్యం ఇచ్చింది. జిల్లాకు పెద్ద ఎత్తున నిధులు మంజూరయ్యాయి. వాటితో నిర్మాణాలు కూడా జరిగాయి. కానీ, 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పర్యాటక రంగం పూర్తిగా నిర్వీర్యమైంది. ఐదేళ్లలో ఎక్కడా పర్యాటక ఆనవాళ్లు లేకుండా చేశారు.



(ఫైల్)

> ఇచ్ఛాపురంలోని శివకృష్ణాపురం-డొంకూరు తీర ప్రాంతం ఇది. ఏటా ప్రత్యేక దినాలతో పాటు కార్తీక మాసంలో పర్యాటకులు అధికంగా వస్తుంటారు. కానీ, ఇక్కడ కనీస సదుపాయాలు లేవు. ఎండకు తల దాచుకోవడానికి నిలువ నీడ లేదు. తాగేందుకు నీరు కూడా దొరకదు. గత వైసీపీ ప్రభుత్వం ఈ బీచ్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పర్యాటకుల కోసం ఎలాంటి వసతులు సమకూర్చలేదు. దీంతో పక్కనే పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సున్నాపూర్ బీచ్‌ను గుర్తుకు తెచ్చుకొని ఇక్కడకు వచ్చిన వారు నిట్టూరుస్తుంటారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. ఇచ్ఛాపురం మండలం శివకృష్ణాపురం- డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ 193 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. ఈ తీర ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన అన్ని వనరులు ఉన్నాయి. ముఖ్యంగా డొంకూరు, కవిటి, బారువ, అక్కుపల్లి, భావనపాడు, కళింగపట్నం, మొగదాలపాడు, కళ్లేపల్లి, గనగళ్లపేట, బందరువానిపేట తీరాలు పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంది. కానీ, గత వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో గార మండలంలోని కళింగపట్నం బీచ్ చాలా అభివృద్ధి చెందింది. భారీ ఒంటెలతోపాటు కొన్నిరకాల జంతువుల ఆకృతులను ఏర్పాటు చేశారు. పర్యాటకులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. పర్యాటక ఉత్సవాలు కూడా జరిపారు. తీరం వరకూ రహదారులను సైతం ఏర్పాటు చేశారు. రిసార్ట్ సైతం నిర్మించారు. అయితే, వైసీపీ పాలనలో ఈ బీచ్ పూర్తిగా నిర్వీర్యమైంది. నిర్వహణను గాలికొదిలేసిన జగన్ సర్కారు రిసార్ట్‌లో బార్‌ను మాత్రం నడిపించింది. జిల్లాలోని మిగతా బీచ్‌లది కూడా ఇదే పరిస్థితి.

అభివృద్ధి చేస్తే ఎంతో మేలు..

ఒడిశాలోని సున్నాపూర్ బీచ్‌కు ఏమాత్రం తగ్గని విధంగా జిల్లాలోని బీచ్‌లను ఎంతో అభివృద్ధి చేయవచ్చు. జిల్లా తీర ప్రాంతం వెంబడి కొబ్బరి, (మిగతా 6వ పేజీలో..)

జిల్లా ఓటర్లు 18,80,065 మంది

- తుది జాబితా విడుదల



మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 18,80,065 మంది ఓటర్లు ఉన్నట్టు డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ అనంతరం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది జాబితాను సోమవారం ఆయన విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా జనవరి 5వ తేదీ నాటికి 18,80,065 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుషులు 9,31,640 మంది, మహిళలు 9,48,299 మంది, ఇతరులు 126 మంది ఉన్నట్టు తెలిపారు. అలాగే ఈ ఏడాది 18-19 మధ్య వయసు గల యువత 19,315 మంది ఎలక్టోరల్స్‌గా నమోదు చేసుకున్నారన్నారు. 80 ఏళ్లు దాటినవారు 31,609 మంది ఉన్నట్టు తెలిపారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని డీఆర్వో వెల్లడించారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
ఇచ్ఛాపురం	1,31,396	1,38,165	17
పలాస	1,07,496	1,12,414	21
టెక్కలి	1,17,977	1,18,694	09
పాతపట్నం	1,12,513	1,13,168	09
శ్రీకాకుళం	1,35,562	1,38,333	29
ఆమదాలవలస	96,094	97,610	15
ఎచ్చెర్ల	1,23,370	1,21,988	13
నరసన్నపేట	1,07,232	1,07,927	13

అతను మా బంధువు.. అందుకే తొలగించం!

- సాగునీటి కాలువపై అక్రమంగా వంతెన నిర్మాణం
- 'రియల్' వ్యాపారులకు కొందరు అధికారుల అండ
- ఓ ఇంజనీరుతో బంధుత్వం ఉండడమే కారణం!
- రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

> ఓ రియల్టర్ వంశధార కాలువపై అక్రమంగా వంతెన నిర్మించారు. దీని వల్ల తాము నష్టపోతామంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. వంతెనను తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఐదు నెలలు గడిచిపోయాయి. అయినా చర్యల్లేవు. అధికారులు నోటీసులతోనే సరిపెట్టారు. కారణం ఓ ఇంజనీరుతో సంబంధిత రియల్టర్‌కు ఉన్న బంధుత్వమే కారణమని తెలుస్తోంది.

సంతబొమ్మాళి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి పంచాయతీ జగన్నాథపురం (రెయ్యపేట)లో కొన్నాళ్ల కిందట ఓ రియల్టర్ అనుమతి లేకుండా లేఅవుట్ వేశాడు. ఈ లేఅవుట్‌కు వెళ్లేందుకు దారి లేకపోవడంతో పక్కనే ఉన్న వంశధార కాలువపై అక్రమంగా వంతెన కట్టేశాడు. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, మెళియాపుట్టి, నందిగాం, పాతపట్నం, సారవకోట మండలాల నుంచి కాకరాపల్లి వరకూ ఈ కాలువ ద్వారా పొలాలకు సాగునీరు అందుతుంది. అక్కడి నుంచి నీరు సముద్రంలో కలుస్తుంది. అటువంటి కాలువపై అధికారుల అనుమతి లేకుండా కాంక్రీట్ వంతెన నిర్మించడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రియల్ దందాపై గత ఆగస్టులో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. రెవెన్యూ, వంశధార అధికారులు కలిసి సర్వే చేశారు. వంశధార శాఖకు చెందిన స్థలంలోనే రియల్టర్ అక్రమంగా కాలువపై వంతెన కట్టేశారని రెవెన్యూ అధికారులు తేల్చారు. దీనిపై అప్పటి తహసీల్దార్ ప్రవీణ్.. వంశధార శాఖకు నివేదిక పంపారు. అయితే వంశధార శాఖకు చెందిన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వంతెన కట్టారని తేల్చినా.. ఇంతవరకు సంబంధిత అధికారులు రియల్టర్‌పై చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రియల్టర్‌కు వంశధార శాఖకు చెందిన ఓ ఇంజనీర్‌తో బంధుత్వం ఉండడం వల్లే ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వంశధార కాలువపై అక్రమ వంతెన నిర్మాణం వల్ల.. వర్షాల సమయంలో వరద నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పంట పొలాలకు ముంపు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షాలకే డీపీఎస్ రోడ్డులో పాలేశ్వరస్వామి ఆలయం నుంచి రెయ్యపేట వరకూ వరదనీరు ముంచెత్తే సందర్భాలు ఉన్నాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలువపై అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై నరసన్నపేట సర్కిల్ వంశధార ఈఈ ప్రదీప్ వద్ద ప్రస్తావించగా.. కాలువపై అక్రమంగా వంతెన నిర్మించిన రియల్టర్‌కు నోటీసులు జారీచేస్తామని తెలిపారు. అనంతరం అక్రమ వంతెన తొలగిస్తామన్నారు.



జగన్నాథపురంలో వంశధార కాలువపై అక్రమంగా నిర్మించిన వంతెన



అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

'మీ కోసం' అర్జీలకు

ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం

7లో

పొందూరులో

ప్రబలిన డయేరియా

- శ్రీకాకుళం రిమ్స్‌కు ఐదుగురి తరలింపు

7లో



ఆస్పత్రిలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో



బ్రాండ్ బాబులు

- ఆధునిక వస్త్రాలంకరణపై ఆసక్తి
- బ్రాండెడ్ వస్తువులపై యువతలో పెరుగుతున్న మోజు
- జిల్లాలో విస్తరిస్తున్న నగర సంస్కృతి

యువతరం ఆహార్యంలో ఆధునికతను కోరుకుంటోంది. వేషభాషలు.. వస్త్రధారణలో ఎప్పటికప్పుడు మారుతున్న స్టయిల్స్‌ను అందిపుచ్చుకోవాలని ఆరాట పడుతోంది. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించేందుకు తాపత్రయ పడుతోంది. తమ రోల్ మోడళ్లను అనుకరిస్తూ ప్రత్యేకత చాటుకోవడానికి ఉవ్విళ్లూరుతోంది. సినిమా, క్రికెట్, ప్రకటనలు, సోషల్ మీడియాలో తాము ఆదరించే వారిని ఆదర్శంగా తీసుకుంటోంది. ప్రస్తుతం ఈ ట్రెండ్ పల్లెలకూ విస్తరించింది.

హిరమండలం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): యువత ఎప్పటికప్పుడు ఫ్యాషన్‌కు అనుగుణంగా మారడం కొత్తేమీ కాదు. సినిమా తారలు, క్రికెటర్ల ప్రభావం చాలా ఏళ్లగా యువతపై ఉంటోంది. కాకపోతే మార్పునకు .... దాన్ని అందిపుచ్చుకోవడానికి మధ్య కాస్త సమయం పట్టేది. కానీ ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో రోజులు..గంటల్లోనే మార్పులను అందిపుచ్చుకుంటున్నారు. దశాబ్ద కాలంగా యువత జీవనశైలిలో వచ్చిన ప్రధాన మార్పులలో ఆహార్యంపై మోజు పెరగడం ఒకటి. కాళ్లకు వేసుకునే పాదరక్షల నుంచి, తలకు పూసుకునే జెల్ వరకు ప్రత్యేకతను కోరుకుంటున్నారు. ఇది పేరున్న సంస్థలకు వరంగా మారింది. తమ ఉత్పత్తులను నగరాల నుంచి పట్టణాలు... ఇంకాస్త ముందుకెళితే పల్లెలకూ విస్తరించేందుకు అవకాశం దొరికింది. ఇక్కడే 'బ్రాండెడ్' పంట పండింది. ప్రముఖ సంస్థల వస్త్రాలు, వస్తువులకు గిరాకీ పెరిగింది.



అదేదో ఇప్పుడే...

'ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు సరదాలు?' అనేది నేటి తరం ప్రశ్న. ఈ ప్రశ్నే.. పెద్ద నగరాల్లోనే కనిపించే ఫ్యాషన్ శైలి జిల్లాకు వ్యాపించేందుకు కారణమవుతోంది. వారాంతపు సరదాలు, వినోదాలు, విందులకు యువకులు అలవాటు పడుతున్నారు. నలుగురిలో కలిసేందుకు... ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఆహార్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. చదువుకునే సమయంలో బాధ్యతలు ఎక్కువగా లేకపోవడం... చిన్న వయసులోనే కాస్తోగొప్పో సంపాదించే అవకాశం వస్తుండడం కూడా యువత వేషధారణపై ప్రభావం చూపుతోంది. అమ్మాయిలతో పాటు అబ్బాయిల్లోనూ అందంపై శ్రద్ధ పెరగడం ఇటీవల వచ్చిన పెద్ద మార్పుగా చెప్పొచ్చు. ఖర్చుపై నియంత్రణ ఉండాలని పెద్దవారు చెబితే...సరదాల తరువాతే ఏదైనా అని యువత బదులిస్తున్నారు.

చిన్న పట్టణాలకూ విస్తరణ

ఒకప్పుడు పెద్ద నగరాలకే పరిమితమైన బ్రాండెడ్ ఉత్పత్తులు ఇప్పుడు జిల్లాల్లోని చిన్న పట్టణాలకూ విస్తరించాయి. జిల్లాలో శ్రీకాకుళం, పలాస, నరసన్నపేట, రాజాం తదితర పట్టణాల్లో బ్రాండెడ్ వస్తువులు లభిస్తున్నాయి. ఈ సంస్థలు తమ షాపులను తెరుస్తున్నాయి. ఒకప్పుడు మహిళలకే సొంతమైన బ్యూటీ పార్లర్లు.. ఇప్పుడు పురుషులకూ అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు మండల కేంద్రాలల్లోనూ రూ.లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు విక్రయించే షోరూంలు అందుబాటులోకి వచ్చాయి. ధర ఎక్కువైనా..కొనుగోలు చేయడానికి యువత వెనుకడుగు వేయకపోవడం బ్రాండెడ్ సంస్థలకు కలిసి వస్తోంది.



సినిమాలదే అగ్రస్థానం..

సినిమాలు యువత ఫ్యాషన్లపై ఎక్కువ ప్రభావం చూపుతున్నాయనడంలో సందేహం లేదు. యువ హీరోల స్టైల్‌ను యువత అందిపుచ్చుకుంటోంది. దుస్తులు, హెయిర్ స్టైల్, చెప్పులు, షూస్... బెల్టులు...టోపీలు..ఇలా ప్రతి దానిలోనూ సినిమాను అనుకరించడాన్ని మనం గమనించవచ్చు. కొందరైతే బైక్‌ల విషయంలోనూ తమ అభిమాన నటులనే అనుసరిస్తున్నారు. కాలి జోళ్ల నుంచి కళ్ల జోళ్ల వరకూ వాడే వస్తువులలో బ్రాండెడ్ సామగ్రినే ఎంచుకుంటున్నారు. డిజైనర్ చొక్కా, జీన్స్ ప్యాంటు ఖరీదు రూ.వెయ్యి నుంచి రూ.4 వేలు. చేతి గడియారం రూ.వెయ్యి నుంచి రూ.6 వేలు, పాదరక్షలు రూ.500 నుంచి రూ.2 వేలు, బూట్లు రూ.వెయ్యి నుంచి రూ.6 వేలు, రాత్రి వేసుకునే దుస్తులు రూ.500 నుంచి రూ.రెండు వేలు, చలువ కళ్లజోళ్లకు రూ.500 నుంచి రూ.4 వేలు, వ్యాయామానికి వెళ్లే స్పోర్ట్స్ డ్రెస్‌కు రూ.వెయ్యి నుంచి రూ.3 వేలు, షాంపూ బాటిల్‌కు రూ.200 నుంచి రూ.400, హెయిర్ స్టయిల్, ఇతర సౌందర్య పోషణకు రూ.400 వరకూ వెచ్చించడానికి వెనుకాడడం లేదు. ఒకప్పుడు వీటిలో అధికశాతం వస్తువులపై డబ్బులు ఖర్చు చేయాలంటే ఆలోచించే వారు.

నీరు కదలనంటోంది

- అధ్వానంగా తోటపల్లి ప్రాజెక్ట్ కాలువలు
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న రెల్లు గడ్డి
- రెండు జిల్లాల రైతులకు కష్టాలు

రాజాం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు కాలువలు అధ్వానంగా మారాయి. కిలోమీటర్ల మేర వ్యర్థాలు, పిచ్చిమొక్కలు పేరుకు పోయాయి. గత ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా విస్మరించడంతో ఈ పరిస్థితి నెలకొంది. శివారు ప్రాంతాలకు సాగునీటి సరఫరాలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఫలితంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, లావేరు, ఎచ్చెర్ల, రణస్థలం తదితర మండలాల రైతులకు సాగునీటి అవస్థలు తప్పడం లేదు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అధికారికంగా 1.20 లక్షల ఎకరాలకు, అనధికారికంగా సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో తోటపల్లి ప్రాజెక్టును నిర్మించారు. దీని రెండు కాలువల ద్వారా రాజాం నియోజకవర్గంతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం తదితర మండలాలకు సాగునీరు సరఫరా అవుతోంది. వీటిలో తెర్లాం మండలం నుంచి అరసబలగ, రాజాం మండలం కంచరాం, గడిముడిదాం, రేగిడి మండలంలోని వ్యవసాయ భూములకు సాగునీరందించే కాలువలో 52.450 కిలోమీటర్ల నుంచి 117.890 కిలోమీటర్ల వరకూ ఇదే దుస్థితి కనిపిస్తోంది. రెండో మార్గంలో తెర్లాం, రాజాం మండలం ఎం.జె.వలస, బి.ఎస్.వలస, గెడ్డవలస, బొద్దాం, సోపేరు మీదుగా శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, రణస్థలం, లావేరు తదితర మండలాల రైతాంగానికి సాగునీరందించే కాలువలదీ ఇదే దుస్థితి. వ్యర్థాలు పేరుకుపోయాయి. పిచ్చిమొక్కలు, రెల్లుగడ్డి పెరిగిపోయింది. ఫలితంగా సాగునీటి సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతోంది.



రేగిడి మండలానికి సాగునీరందించే కాలువ ఇలా..



తోటపల్లి ప్రాజెక్టు కాలువ

అప్పట్లో నిర్లక్ష్యం...

గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలతో పాటు అత్యంత ప్రాధాన్యం కలిగిన సాగునీటి రంగాన్నీ నిర్వీర్యం చేసింది. కాలువల మరమ్మతులు, ఆధునికీకరణ, లైనింగ్ పనుల కోసం ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. దీంతో రైతాంగానికి అయిదేళ్లూ అవస్థలు తప్పలేదు. వర్షాధారంపై ఆధారపడే రైతులు చెరువులు, నేలబావుల్లోని నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడుతూ సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే తోటపల్లి కాలువలను ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు వ్యర్థాలను కాలువల్లో పడేస్తున్నారు. దీంతో సాగునీటి ప్రవాహ వేగం మందగించి... సకాలంలో శివారుకు చేరడంలేదు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి వనరుల అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదని.. ప్రస్తుతం కాలువల పరిస్థితిపై నివేదిక తయారుచేసి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తోటపల్లి ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. కాలువల్లో వ్యర్థాలు వేయకుండా సమీప పంచాయతీల ప్రజాప్రతినిధులు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.



బొద్దాం వద్ద కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఎలుకల బోన్లనూ వదల్లే!

(ఐదో పేజీ తరువాయి)

వాపోతున్నారు. ప్రభుత్వ నిధులు పక్కదారి పడుతుండడంతో సొంత డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. దీనిపై ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేసినట్లు విమర్శలు ఉన్నాయి.

- ఆ అధికారిణి తీరుతో విసిగిపోయిన కొందరు ఉద్యోగులు సీఎం కార్యాలయానికి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర రీజియన్ డైరెక్టర్ చిన్మయిదేవి డిసెంబరు 31న విచారణ చేపట్టారు.
- ఈ విషయమై ఆర్జేడీ చిన్మయదేవి వద్ద ప్రస్తావించగా.. ఐసీడీఎస్‌లో ఓ అధికారిణిపై ఫిర్యాదులు రావడం వాస్తవమేనన్నారు. ఇటీవల విచారణ చేపట్టామని, ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని తెలిపారు.
- ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిణి వద్ద అక్రమాల విషయమై ప్రస్తావించగా.. కొంతమంది కావాలనే తనపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. సక్రమంగా పని చేయాలని చెబితే.. కొంతమంది తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తానెప్పుడూ నిబంధనలు అతిక్రమించలేదని తెలిపారు.

సుదూర తీరం.. పర్యాటకం లేదాయె!

(ఐదో పేజీ తరువాయి)

జీడి, ఇతర ఉద్యాన పంటలు కనువిందు చేస్తాయి. బాహుదా, మహేంద్ర తనయా, వంశధార, నాగావళి నదీ సంగమాలు ఉన్నాయి. తీరానికి దగ్గరగా పురాణ, చారిత్రక, ఇతిహాసాలతో ప్రసిద్ధి చెందిన ఆలయాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. చిత్తడి, బీల నేలల శోయగం కూడా. విదేశాల నుంచి వేలాది కిలోమీటర్లు దాటుకుంటూ ఇక్కడకు పక్షులు వస్తుంటాయి. తెలవారగానే కిలకిలారావాలతో నిద్రలేపుతాయి. పూండి, నౌపడ ఉప్పుగల్లీలు, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఎర్రమట్టి దిబ్బలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వీటిని అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు నిరుద్యోగ యువతకు మెండుగా ఉపాధి లభిస్తుంది.

అభివృద్ధి చేస్తాం



బీచ్‌ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. దీనికోసం కొత్త పాలసీ తెస్తాం. జిల్లాలోని బీచ్‌ల్లో పర్యాటకుల సందడి బాగా పెరిగింది. వారికి అనుకూలంగా ఉండేలా బీచ్‌లు అభివృద్ధి చేస్తాం.

- బెందాళం అశోక్, ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే

బెంచీలు కూడా ఉండవు



జిల్లాలోని ఏ బీచ్‌లో కూడా కనీస వసతులు లేవు. కేవలం సముద్రం చూసి రావడానికి అన్నట్టు ఉంటుంది పరిస్థితి. తీరంలో బెంచీలు కూడా ఉండవు. ఇచ్ఛాపురం పక్కనే ఉన్న ఒడిశాకు చెందిన సున్నాపూర్ బీచ్ చూస్తే కళ్లు చెదిరిపోతాయి. ఆ బీచ్ మాదిరిగానే ఇక్కడ కూడా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి.

- దక్కత సుమన్‌రెడ్డి (రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్), ఇచ్ఛాపురం

ఒడిశా బీచ్‌లే దిక్కు



కుటుంబంతో కలిసి శివకృష్ణాపురం-డొంకూరు బీచ్‌కు వెళితే అక్కడ కూర్చోవడానికి కుర్చీలు కూడా ఉండవు. ఎండకు, వర్షానికి తలదాచుకోవాలంటే చెట్లే గతి అవుతున్నాయి. అందుకే జిల్లా ప్రజలకు ఒడిశా బీచ్‌లే దిక్కు అయ్యాయి. సేద తీరేందుకు ఒడిశా వెళుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాల్సిన అవసరముంది.

- కె.గోవిందరెడ్డి, వైద్యుడు, ఇచ్ఛాపురం

ప్రభుత్వానికి నివేదిక అందించాం

జిల్లాలో తీర ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఇతర ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు ఇచ్చారు. వాటిని ప్రత్యేక పరిగణగా తీసుకున్నాం. ఇచ్ఛాపురం మండలం నుంచి రణస్థలం మండలం వరకూ ఉన్న తీరంలో పర్యాటకాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఒక నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించాం.

- నడిమింటి నారాయణరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి, శ్రీకాకుళం



స్కాన్ చెయ్.. బిల్లు చెల్లించెయ్!

- అమలులోకి క్యూఆర్ కోడ్
- బిల్లుపైనే ముద్రణ
- విద్యుత్ శాఖలో నూతన విధానం
- నరసన్నపేటలో విజయవంతం
- జిల్లా అంతటా విస్తరణకు శ్రీకారం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు


నరసన్నపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ఆ శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన విధానం సత్ఫలితాలు ఇచ్చిందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అమలుకు శ్రీకారం చుడుతున్నారు. నెలవారీ విద్యుత్ బిల్లుల చెల్లింపును ఏపీఈపీడీసీఎల్ మరింత సులభతరం చేసింది. ఇంటి వద్ద నుంచే బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబరు అనుసంధానంగా ఉండే ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా చెల్లింపును మరింత సులభతరం చేసేందుకు విద్యుత్ బిల్లులపైనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించి, ప్రత్యేక డిజిటల్ విధానాన్ని రూపొందించింది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సులువుగా బిల్లు కట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ నెల నుంచి జిల్లాలో దీన్ని అమలు చేయనున్నారు. హెచ్‌టీ సర్వీసులకు మినహాయించి బకాయిలు లేని మిగిలిన సర్వీసుదారులకు స్కాన్ ద్వారా బిల్లు కట్టే అవకాశం కల్పించారు.



ప్రయోగాత్మకంగా..

నరసన్నపేట పట్టణం, రూరల్ పరిధిలో 31,244 మంది విద్యుత్ వినియోగదారులు ఉండగా... క్యూఆర్ కోడ్ దారా 28,307 మంది నవంబరు, డిసెంబరు నెలల్లో బిల్లులు చెల్లించారు. ఇది విజయవంతం కావడంతో ఈ నెల నుంచి జిల్లాలో అమలు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో 7,54,478 విద్యుత్ మీటర్లు ఉన్నాయి. వీటిలో గృహావసరాలు, వాణిజ్యం, పరిశ్రమలు, వీధి దీపాలు తదితర కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 7,22,572 మీటర్లకు క్యూఆర్ విధానంలో బిల్లింగ్ ఇచ్చారు. గత ఏడాది జూన్ వరకు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లుగా ఉన్న గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్స్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వెసులుబాటు ఉండేది. రిజర్వు బ్యాంకు ఆదేశాలతో విద్యుత్ సంస్థలు వాటి సేవలు నిలిపివేశాయి. ఈ పద్ధతిలో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వినియోగదారులకు సులువుగా ఉండేది. ఆ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి సకాలంలో సంస్థ ఖాతాలకు డబ్బు జమయ్యేది కాదు. దీని వల్ల డబ్బుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ చెల్లింపుల్లో జాప్యం కారణంగానే రిజర్వు బ్యాంకు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో యూపీఐ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా బిల్లులు చెల్లించే పద్ధతికి స్వస్తి చెప్పారు. ప్రత్యామ్నాయంగా పాత పద్ధతిలోనే మీ సేవా కేంద్రాలు, సంబంధిత సెక్షన్ కార్యాలయాలు, సంస్థకు చెందిన ఈస్ట్రన్ పవర్ యాప్‌లో చెల్లించేవారు. మీ సేవా కేంద్రాల్లో అయితే సర్వీసు చార్జీ రూ.5 చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానంలో ఉన్న లోపాలను అధిగమించేందుకు వినియోగదారునికి బిల్లులు అందిన వెంటనే చెల్లింపుల ప్రక్రియ వేగవంతమయ్యేలా క్యూఆర్ కోడ్‌ను విద్యుత్ సంస్థలు అందుబాటులోకి తెచ్చాయి. దీనిపై గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. క్యూఆర్ విధానంలో చెల్లింపుల వల్ల పారదర్శకత ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

కష్టం తప్పింది



గతంలో కరెంట్ బిల్లులు చెల్లించేందుకు కార్యాలయాలకు వెళ్లే వాళ్లం. క్యూ లైన్‌లో వేచి ఉండాల్సి వచ్చేది. యాప్‌ల ద్వారా చెల్లింపులతో సైబర్ నేరాలు జరుగుతాయనే భయం ఉండేది. క్యూఆర్ విధానంతో చెల్లింపుల తీరు బాగుంది.

-ఊణ్నా రంగనాథ్, వ్యాపారి, నరసన్నపేట

మోసాలకు అవకాశం ఉండదు



జిల్లాలో క్యూఆర్ కోడ్‌తో బిల్లులు ఇస్తున్నాం. దీనిపై వినియోగదారులకు అవగాహన పెంచాం. బిల్లింగ్‌లో పారదర్శకత పెరుగుతుంది. స్కాన్ చేయడం ద్వారా చెల్లింపులతో ఎటువంటి మోసాలకు ఆస్కారం ఉండదు. వినియోగదారులు సులువుగా చెల్లించుకోవచ్చును. బిల్లింగ్‌లో లోపాలు ఉన్నా.. సరిదిద్దుకోవచ్చు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలి.

- ఎన్.కృష్ణమూర్తి, ఎస్ఈ, ఆపరేషన్స్



మీకోసం అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ మీ కోసంలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమా వేశ మందిరంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 84 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని కోరారు. పరిష్కారంలో ఎటువంటి అలసత్వానికి తావులేద న్నారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి అధికంగా ఫిర్యాదులు వస్తున్నా యని, ప్రత్యేక కౌంటర్ ఏర్పాటుచేసి, సమస్యల పరిష్కారం వేగవంతం కావ డానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్య క్రమంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, డీపీవో కె.భారతి సౌజన్య, జిల్లా పర్యాటకాధికారి నారాయణరావు, బీసీ సంక్షేమాధికారి అనూరాధ, డీఎంహెచ్‌వో టీవీ బాల మురళీకృష్ణ, ఐసీ డీఎస్ పీడీ శాంతిశ్రీ, డ్వామా పీడీ సుధాకరరావు, ఉద్యానవన అధికారి ప్రసా దరావు పాల్గొన్నారు.

బయోమెడికల్ వ్యర్థాలపై దృష్టి సారించండి

బయోమెడికల్ వ్యర్థాలపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ,ప్రైవేటు ఆసుపత్రుల సిబ్బందితో సమీక్షించారు.ఈ సం దర్భంగా బయోమెడికల్ వ్యర్థాలపై వివరాలను కాలుష్యనియంత్రణ మండలి ఈఈని అడిగితెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు నిర్వహించారని ప్రశ్నించారు. వ్యర్థాల సేకరణలో ఉన్న సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించా రు. ఆర్ఎంపీలతో సమావేశం ఏర్పాటుచేయాలని కోరారు. మునిసిపల్ కార్పొ రేషన్, పంచాయతీల నుంచి ఎంతమేర బయోమెడికల్ చెత్త వస్తోంది, ఎంత రావాల్సి ఉందని ఆరాతీశారు. సంబంధిత ఏజెన్సీకి బయోమెడికల్ సరిగా వెళ్తున్నాయాలేదో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే సమావే శం నాటికి, తనిఖీలపై డేటా, పూర్తి వివరాలతో రావాలని స్పష్టంచేశారు. ప్రతి రోజూ ఎంత వేస్టేజ్ వస్తుందో నమోదుచేయాలని ఆదేశించారు. సమావేశం లో ఈఈ కరుణశ్రీ, డీసీహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణ్‌బాబు, జీజీహెచ్ సూపరింటెం డెంట్ షకీలా, ఆసుపత్రుల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 220 మంది అర్హత



కానిస్టేబుల్ అభ్యర్థికి ఎస్పీ మహేశ్వరరెడ్డి సమక్షంలో దేహదారుఢ్య పరీక్ష నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

ఎచ్చెర్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి):పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో ఆరో రోజు సోమవారం దేహదారుఢ్య పరీక్షలు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలో జరిగాయి. 631 మంది ఈ పరీక్షలకు హాజరుకావల్సిఉండగా, 364 మంది హాజరయ్యారు. ఈ మేరకు 220 మంది అర్హత సాధించారు. మంగళవారం కూడా శారీరక దారుఢ్య పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయి.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పొందూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో రైతులకు ఎదురవుతున్న భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కూనరవికుమార్ తెలిపారు. సోమవారం మండలం లోని దళ్లపేటలో నిర్వహించిన రెవెన్యూసదస్సులో మాట్లాడుతూ వైసీపీ ప్ర భుత్వం రీసర్వేపేరుతో రైతుల మధ్య సమస్యలను సృష్టించిందని ఆరోపించా రు.కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు, టీడీపీ మండలాధ్యక్షు డు సీహెచ్ రామ్మోహన్, బలగ శంకరభాస్కర్, రఘురాంరెడ్డి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు డొంకూరు విద్యార్థులు



ఇచ్ఛాపురం: గ్రిగ్స్‌పోటీల్లో ప్రశంసాపత్రాలు సాధించిన విద్యార్థులు

ఇచ్ఛాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్, ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. గతఏడాది డిసెంబరులో ఏలూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 షాట్‌పుట్ బాలురు విభాగంలో బి.భరత్‌చంద్ర రజితపథకాన్ని సొంతం చేసుకున్నాడు.పల్నాడులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 బాలికల ఖోఖోపోటీల్లో డి.మీనా సత్తాచాటి రజిక పతకాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఈనెల 10న మహారాష్ట్రలోని కొల్హాం పూర్‌లో జరగనున్న జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో బి.భరత్‌చంద్ర, జార్ఖండ్ లోని రాంచిలో ఈనెల 11న జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో డి.మీనా పాల్గొనున్నారు. ఈమేరకు పాఠశాలలో హెచ్ఎం జి.సరోజిని, ఎస్ఎంసీ ఛైర్మన్ కె.జానికిరావు, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

గ్రిగ్స్‌పోటీల్లో సత్తాచాటిన ఈదుపురం విద్యార్థులు

ఈదుపురం జడ్‌పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు కవిటి జీహెచ్ఎస్ పాఠ శాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్‌పోటీల్లో సత్తాచాటారు. ఈదుపురం విద్యార్థులు కబడ్డీలో, వ్యక్తిగత క్రీడాపోటీల్లో1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానంలో నిలిచారు. 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, 400 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం, 4,100 రిలే పరుగు పందెంలో తృతీయ స్థానంలో నిలిచారు.ఈమేరకు విద్యార్థులకు హెచ్ఎం బి.తాతయ్య, ఎస్ఎంసీ ఛైర్మన్ ఎస్.నరసింహులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పైడిభీమవరం విద్యార్థుల ఎంపిక

రణస్థలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు పైడిభీ మవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ కె.సుదర్శనం తెలిపారు.క్రికెట్,అథ్లెటిక్స్‌లో అండర్-17కు పి.నవ్య, డి.హారిక, పి.తరుణ్‌కుమార్, ఎం.చంద్రష్, కె.కుశాల్,అండర్-19లో కె.మురళి, పి.చరణ్,అండర్-17 హేమర్‌త్రో లో డి.చందనకుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల నుంచి తొమ్మిదిమంది ఎంపికయ్యారని హెచ్ఎం టి.శోభారాణి తెలిపారు.

స్వర్ణాంధ్ర దిశగా కూటమి పాలన

ఆమదాలవలస, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో స్వర్ణాంధ్రదిశగా ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలన కొన సాగుతోందని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ తెలిపారు. సోమవారం ఆమ దాలవలసలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా సామాజిక పింఛన్లను రూ.4 వేలు పెంపు, ఐదు రూపాయలకే అన్న క్యాంటీ న్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.పేదలకు ఐదు రూపాయ లతో పట్టెడు అన్నం పెట్టలేకపోయిన వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల ఖజానా ఖాళీ అయినా చంద్రబాబు ముందుచూపు, పరిపాలన దక్షతతో రాష్ట్రంలో పరిస్థితులను చక్కబెడుతున్నారన్నారు.

డిగ్రీ అధ్యాపకుల సంఘం ఉపాధ్యక్షుడిగా కృష్ణారావు

గుజరాతీపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా డిగ్రీ కళాశాలల అధ్యా పకుల సంఘ ఉపాధ్యక్షుడిగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కామర్స్ విభా గాధిపతి ఎల్.కృష్ణారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈమేరకు అధ్యాపకుల వినతులు, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు కోరారు. ఈ సందర్భంగా కృష్ణారావును అధ్యాపకుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఎన్.సిన్నారావు, వైస్ ప్రిన్సిపాల్ శంకరనారాయణ, కళాశాల సిబ్బంది అభినందించారు.

పొందూరులో ప్రబలిన డయేరియా

● శ్రీకాకుళం రిమ్స్‌కు ఐదుగురి తరలింపు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పొందూరులోని ఖస్పావీధి డయేరియా విజృంభించింది. మూడురోజుల కిందట డయేరియా ప్రబల డంతో తొలుత బాధితులను పొందూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. వీరిలో ఐదుగురిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆ వీధిలో 15 మంది వరకు డయేరియాతో మంచపట్టారు. పది మందికి పొందూరు సీహెచ్‌సీలో సేవలందుతున్నాయి. వ్యాధి తీవ్రత పెరుగుతుండడంతో తాడి వలస పీహెచ్‌సీ వైద్యుడు రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఖస్పా వీధిలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది ఖస్పావీధితో పాటు సమీప వీధుల్లో పారిశుధ్యకార్యక్రమం నిర్వహించారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్‌చేశారు. కాగా ఖస్పావీధి లో డయేరియా ప్రబలడంతో ఎమ్మెల్యే కూన రవికుమార్ పంచాయతీ, వైద్యసిబ్బందిని అప్రమత్తం చేశారు. డీఎంహెచ్‌వో బి.కృష్ణతో ఫోన్‌లో మాట్లాడగా ఆయన హుటాహుటిన పొందూరు చేరుకున్నారు. దీంతో వారిద్దరూ బాధితులను సోమవారం పరామర్శించారు. రానున్న వారంరోజుల్లో పండుగల నేపథ్యం లో వ్యాధి మరింత విజృంభించే అవకాశ ముందని, అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని, పంచాయతీ ఈవో మోహన్‌బాబును వారు ఆదేశించారు. అనంతరం డీఎంహెచ్‌వో పొందూరు ఆసుపత్రిలో డయేరియా లక్షణాలతో చికిత్సపొందుతున్న బాలుడిని పరామర్శించారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

● చిన్నజొన్నవలసలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు ● బాధితులకు ఇళ్ల పట్టాల మంజూరు



తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న ఆక్రమణదారులు

ఆమదాలవలస, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నజొన్న వలస వద్ద మొదుగుల చెరువు గట్టుపైన గల అక్రమ నిర్మాణాలను రెవె న్యూ అధికారులు సోమవారం తొలగించారు. సర్వేనెంబర్ 108లో ఒకటి, రెండు ఆర్అండ్‌బీ స్థలంలోని సర్వే నెంబర్-14లో మొదుగుల చెరువు గట్టుపై సుమారు 30 సెంట్లు స్థలంలో 21 మంది ఇళ్లు పశువుల శాలలు, బడ్డీలు నిర్మించుకున్నారు. గతంలో చెరువు గర్భం ఆక్రమణకు గురవు తోందని, అదే గ్రామానికి చెందిన రెడ్డి తవుడు హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించారు. తహసీల్దార్ ఎస్.రాంబాబు ఆధ్వర్యంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ బాలరాజు, ఎంపీడీవో వెంకటరావు తదితర అధికారులు అక్కడకుచేరుకొని ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇళ్ల నిర్మా ణాలను తొలగించే సమయంలో ఆందోళనకారులు నిరసన తెలియ జేయకుండా డీఎస్పీ చర్యలు తీసుకున్నారు.అక్రమ నిర్మా ణదారులకు అన్నిశాఖల అధికారులు కలిసి సమన్వయం తో వారికి మరోచోట ఇళ్ల పట్టాలను అందించి తొలగింపు పనులు చేపట్టారు. ఆక్రమణలు తొలగిస్తున్న సమయం లో బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్లను కూల్చి వేస్తే తాము ఎక్కడ నివసించాలని కన్నీరుపెట్టుకున్నారు. కాగా 2023ఆగస్టులో ఆక్రమణలు తొలగించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చినా, జిల్లా, మండల స్థాయి అధి కారులు పెడచెవిన పెట్టడంతో ఫిర్యాదారుడు కోర్టు ధిక్కా రణ నేరంకింద అప్పటి ఐఏఎస్ అధికారులు మన్‌జీర్ జిలానీ, శ్రీకేశ్ బాలాజీ లత్కర్‌తోపాటు ముగ్గురు ఆర్డీవోలు నలుగురు రెవెన్యూ తహసీ ల్దార్లపైన హైకోర్టును ఆశ్రయించాడు.దీంతో ఈనెల 20లోగా ఆక్రమణలు తొలగించకపోతే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆదేశాలు వెలువరించడంతో రెవెన్యూ అధికారులు తొలగించారు. కార్య క్రమంలో ఆర్అండ్‌బీ డీఈ గణపతి, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోపి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పప్పల గోవిందరావు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటికో వ్యాపారవేత్త లక్ష్యం

● మహిళలకు రూ.100 కోట్ల రుణాలు ● శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్



డ్వాక్రాబజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఇంటికో వ్యాపారవేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఇప్పటికే విజన్ -2047 సిద్ధంచేశారని చెప్పారు. సోమవారం శ్రీకాకుళంలోని ఏడురోడ్లకూడలివద్ద గల ఎన్టీఆర్ మునిసిపల్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటుచేసిన డ్వాక్రాబజార్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ యజమాని వ్యసనాలకు బానిసైతే ఆ కుటుంబం చిన్నాభిన్నాంకావడాన్ని చం ద్రబాబునాయుడు చూశారని, ఆ పరిస్థితుల నుంచి కుటుంబాన్ని బయటపడేయాలం టే మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే మార్గమని భావించి డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గానికి సంబంధించి డ్వాక్రా మహిళలకు రూ.100 కోట్ల రుణాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్ర మంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్,సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, అరవల రవీంద్ర, మాదారపు వెంకటేష్, రెడ్డి గిరిజాశంకర్, పాండ్రంకి శంకర్, కొండలరావు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం

గార జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. గొర్లెవానిపేటలో కమ్యూ నిటీ హాలు, రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

ఎరుకల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సూర్యారావు

పొందూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి: పొందూరు ఎరుకలకాలనీకి చెందిన గొర్లె సూర్యారావు ఉత్తరాంధ్ర జిల్లాల ఎరుకల సేవాసంఘం కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షు డిగా ఎన్నికయ్యాడు. ఈమేరకు విశాఖలో ఆ సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.శ్రీనివాస రావు, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.రమణమూర్తి, దాసరి నారా యణమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూర్యారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

శివారు ఆయకట్టుకూ సాగునీరు

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి):నారాయణపురం కుడి కాలువ ద్వారా వచ్చే ఖరీఫ్ నాటికి శివారు ఆయకట్టుకు సాగునీరందించేలా చర్యలు తీసుకుంటామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. సోమవారం మండలంలోని ధర్మవరంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపా యాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కొంతమంది రాజకీయ నాయకుల స్వార్థం వల్ల అభివృద్ధి ఆగకూడదన్న దృష్ట్యా ప్రభుత్వంలో ఉన్న పెద్దలతో చర్చించి ఈ పనులను శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం,పార్టీ మండలాధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నేతలు గాలి వెంకటరెడ్డి, పంచిరెడ్డి కృష్ణారావు, రుప్ప రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

లీజు రద్దుకు ప్రతిపాదన

ఎచ్చెర్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మం డలంలోని ముద్దాడపేట వద్ద నాగావళి నదిలో ఇసుక రీచ్‌లోలీజును రద్దుచేయా లని ప్రతిపాదించామని తహసీల్దార్ ఎ. సింహాచలం తెలిపారు.ముద్దాడపేట వద్ద నాగావళి నదిలో ఇసుక రీచ్‌ను రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. యంత్రాలను వినియోగించి ఇసుక తవ్వు తున్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు తనిఖీచేశారు. ముద్దాడపేట వద్ద నదిలో సర్వే నెంబరు 478లో 0.87 హెక్టార్లలో ఇసుకను మాన్యువల్‌గా తవ్వ కాలు జరిపేందుకు ఓ వ్యక్తికి అనుమతి చ్చారు. అయితే యంత్రాలను వినియోగిం చి లారీలతో ఇసుకను తరలిస్తున్నారన్న ఆరోపణలు రావడంతో రీచ్‌ను పరిశీలించి నట్లు తహసీల్దార్ ఎ.సింహాచలం తెలిపా రు. ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కుపంపినట్లు చెప్పారు. రెవెన్యూ ప రిశీలకులు,వీఆర్వో,సర్వేయర్ పాల్గొన్నారు.

వివిధ కోర్సుల్లో శిక్షణకు ప్రవేశాలు

ఎచ్చెర్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎచ్చె ర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వ యం ఉపాధి శిక్షణ సంస్థలో వివిధ కోర్సు ల్లో ఈనెల 18న ప్రారంభించనున్న శిక్ష ణకు ప్రవేశాలు కల్పించనున్నట్లు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గంవర్క్, బ్యూటీపార్లర్, కంప్యూటర్ అకౌంటెన్సీలో 30రోజులపాటు ఉచితంగాశిక్షణ ఇవ్వనున్న ట్లు పేర్కొన్నారు. శిక్షణాకాలంలో ఉచితం గా భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాం త మహిళలు మాత్రమే శిక్షణ పొందేం దుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు 79933 40407, 95534 10809 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

రహదారి భద్రతపై అవగాహన

సోంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : యువతరహదారి ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ లవరాజు కోరారు. సోంపేటలో రహదారి భద్రత వారోత్సవా ల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి



కేంద్ర మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న యూనియన్ నాయకులు

అరసవల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2002 ద్వారా హెల్త్ అసిస్టెంట్లగా నియ మితులై, 22 ఏళ్లుగా కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఏ(మేల్)లు 920 మందిని విధుల నుంచి తొలగించడం సరికాదని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకో వాలని యూనియన్ నాయకులు కోరారు.ఈ మేరకు శ్రీకాకుళంలోని కేంద్ర పౌరవి మానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి ఆయన నివాసంలో యూని యన్‌నాయకులు సోమవారం వినతిపత్రంఅందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చాలామందికి 50 ఏళ్లు దాటిపోయాయని, ఇన్నేళ్ల సర్వీసు తర్వాత ఉద్యోగాల్లో నుంచి తీసేస్తే కుటుంబాలతో ఎలా జీవించాలని వాపోయారు. ఆరోగ్యశాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడి అందరికీ న్యాయంచేస్తామని కేంద్రమంత్రి హామీఇచ్చారు. కార్య క్రమంలో యూనియన్ నాయకులు బి.మురళి, నాగరాజు,రాంబాబు, శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి 50 మంది హెల్త్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వివేకానంద సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి

సరుబుజ్జిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద సాహిత్యాన్ని విద్యార్థుల అధ్యయనం చేయాలని రొట్టవలస జడ్పీ హైస్కూల్ ప్లస్ హెచ్ఎం కె.రామకృష్ణారా వు కోరారు. సోమవారం రొట్టవలసలో స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు పురస్క రించుకుని శారద రామకృష్ణసేవాసమితి ఆధ్వర్యంలో జాతీయ యువజన వారోత్సవా లను ప్రారంభించారు. స్వామి వివేకానంద జీవితం-సందేశంపై నిర్వహించి వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన కె.ప్రశాంతి, బి.రాణి, జి.ఉషా, ఎ.గ్లోరీలకు స్వామి వివే కానంద సాహిత్యాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఉత్సవ కన్వీనర్ మందపల్లి రామకృష్ణారావు పాల్గొన్నారు.

రైతుల భూములు సర్వే చేయించండి

ఇచ్ఛాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి):కేశుపురం పంచాయతీ పరిధిలో రైతుల భూములు సర్వే చేయించాలని మాజీ ఎంపీపీ దక్షత ఢిల్లీరావు కోరారు. ఈమేరకు సోమవారం కేశుపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఎన్.వెంకటరావుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేశుపురంపంచాయతీ పరిధిలో 60ఏళ్లుగా గడ్డ వరదల వల్ల దిబ్బలుగా మారడంతో సరిహద్దులు కలిసిపోయాయని ప్రత్యేకంగా సర్వే చేయించి భూ సమస్య పరిష్కరించాలని తెలిపారు. కేసుపురం, సన్యా సిపుట్టుగ, నీలాపుపుట్టుగ రైతుల భూములు సరిహద్దులు పాత రికార్డులు ప్రకారం సర్వేచేసి రైతులకు ఇప్పించాలని కోరారు.

బాలల హక్కులు పరిరక్షించాలి

ఆమదాలవలస, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలసలో సోమవారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం చైల్డ్‌రైట్స్ అవేర్‌నెస్ ఫోరం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూబాలల హక్కుల పరిరక్షణకు శతశాతం భరోసాగా నిలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌రైట్స్ అవేర్ నెస్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు ధనలక్ష్మి, తమ్మినేని చిరంజీవినాగ్, కిల్లి సత్యనారా యణ, గొండు సీతారాం, మెట్ట మల్లేశ్వరరావు, కొత్తకోట శ్రీనివాసరావు, బి.లవకుశ, బచ్చు లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

రణస్థలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):విశాఖలో బుధవారం నిర్వహించే ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతం చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. ఈమేరకు రణస్థలంలో అధికారులు, కూటమి నాయకలతో సోమ వారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవ ర్గం నుంచి 10 వేల మంది అభిమానులు మోదీ సమావేశానికి హాజరుకానున్నారని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంక శ్యామలరావు, ముప్పిడి సురేష్, చౌదరి బాబ్జీ, బెండు మల్లేశ్వరరావు, డీజీఎం ఆనందరావు, పిషిని జగన్నాథంనాయుడు, వి.జోగురాజుమౌళి, గోవిందరెడ్డి, జీరురామారావు, పిన్నింటి మధుబాబు పాల్గొన్నారు.

● పొందూరు, జనవరి6 (ఆంధ్రజ్యోతి) :విశాఖలో బుధవారం జరగనున్న ప్రధా నమంత్రి మోదీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. సోమవారం పొందూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమా వేశంలో మాట్లాడారు. విశాఖ ఏయూప్రాంగణంలో నిర్వహించే సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌సహా ముఖ్య నేతలను హాజ రవుతారని తెలిపారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు



మాట్లాడుతున్న ఖజానా అధికారి రవికుమార్

అరసవిల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని జిల్లా ఖజానాశాఖ ఉప సంచాల కుడు సి.రవికుమార్ తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 165 మం ది పెన్షనర్లకు జీవన ప్రమాణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఎం ప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ముంద్రించిన డైరీని ఆయన ఆవిష్కరించారు.కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.సోమసుందరరావు, సిటీ బ్రాంచ్ గౌరవాధ్యక్షుడు బలరామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి పిఎస్.ప్రసాదరావు, అసోసియేట్ అధ్యక్షుడు పి.నరసింహ మూర్తి, కోశాధికారి కె.వేంకటేశ్వరరావు, నగర అధ్యక్షుడు జానకిరామ్ పట్నాయక్, కార్యదర్శి నరసింహ పండా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు, ఎల్‌వీకే నందికేశ్వరరావు, సవరయ్య, ఆదినారాయణరావు పాల్గొన్నారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

● ఆర్టీసీ కొత్త బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీష

పలాస, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కూటమి ప్రభుత్వ కల్పించనున్నట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం ఆర్టీసీ డిపో ఆవరణలో కొత్తగా మంజూరైన నాలుగు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సు సర్వీసులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోనే ఏపీ ఎస్ఆర్టీసీ మంచి సేవలు అందిస్తోందన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సంస్థను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత లాభాల బాటలోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ ధ్యేయమని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆమె ఆర్టీసీ బస్సులో రెండు కిలో మీటర్లు ప్రయాణించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, డీఎం ఆర్.సీతారామ నాయుడు, ఏడీఎం ఆర్.సంతోష్ కుమార్, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, సీనియర్ నాయకుడు ఎం.నరేంద్ర (చిన్ని), జోగ మల్లి, కొరికాన శంకర్, కార్మిక సంఘ నాయకులు పి.వాలి, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రధాని సభకు 65 బస్సులు: బగ్గు

నరసన్నపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గురువారం విశాఖ రానున్న నేపథ్యంలో నియోజకవర్గం నుంచి 65 బస్సులను కేటాయించామని, కూటమి నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీ నుంచి యువకులు, మహిళలను తీసుకురావాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉందన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రధాని పర్యటనను విజయవంతం చేయండి: శిరీష

పలాస/హరిపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్ర మోదీ గురువారం విశాఖపట్నంలో పర్యటి స్తున్నందున ఈ పర్యటనను కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. సోమవారం పలాస, హిమగిరి టీడీపీ కార్యాలయాల్లో కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపు నిచ్చారు. కార్య క్రమంలో కూటమి నాయకులు వజ్జ బాబూరావు, బావన దుర్యోధన, బడ్డ నాగరాజు, దువ్వాడ శ్రీకాంత్, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, దడియాల నర్సింహులు, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, పలువురు నేతలు పాల్గొన్నారు

విద్యార్థుల ఆకలి తీర్చడమే సంకల్పం: ఎంజీఆర్

హిరమండలం/కొత్తూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ఆకలి తీర్చడమే ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. హిరమండలం, కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. విద్యా సంస్థల బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు తూలు గు తిరుపతిరావు, తహసీల్దార్ హనుమంతురావు, ఎంఈవో కె.రాంబాబు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కొత్తూరు: విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

క్రైం కార్నర్

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

ఆమదాలవలస, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో కోటిపల్లి రాజు (23)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ పొడ్రంకి సత్యనారాయణ, ఎస్ఐ సనపల బాలరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ కథనం మేరకు.. నూడిల్స్ షాపులో పని చేస్తున్న కోటిపల్లి రాజుకు ఓ బాలికతో ఏడాదిగా పరిచయం ఉంది. రాజు బాలికను ప్రేమ పేరుతో వంచించి ఆమెకు ఇష్టం లేకుండా అత్యాచారానికి పాల్పడాడు. ఆ బాలిక గర్భిణిగా ఉన్నట్లు తల్లిదండ్రులు గుర్తించి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాజుపై పోక్సో కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం కోసం స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులకు లేఖ రాశారు.

సీఆర్‌పీఎఫ్ హెచ్‌సీ మృతి



అంత్యక్రియల్లో గౌరవ వందనం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది (ఇన్‌సెట్‌లో) రమణారావు(ఫైల్)

పొందూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోలాపిలో సీఆర్ పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ బొనిగి రమణారావు అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం మేరకు... తోలాపికి చెందిన రమణారావు (54) ప్రస్తుతం చత్తీస్‌ఘడ్‌లోని సీఆర్ పీఎఫ్ 19 వ బెటాలియన్‌లో హెచ్‌సీగా పనిచేస్తున్నారు. మూడురోజుల సెలవుపై ఇంటికి వచ్చిన ఆయన సోమవారం ఉదయం బాత్‌రూంకు వెళ్లి గుండె పోటుకు గురై పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య జ్యోతి, ఇద్దరు కుమారులున్నారు. రమణారావు మృతిచెందిన సమాచారం అందడంతో సీఆర్‌పీఎఫ్ ఎస్ఐ పి.తిరుమల, సిబ్బంది చాంద్, రాజేష్ పాండే, దేవానంద్, పి.సెంథిల్, ఆర్‌బీ అతుల్ తదితరులు చేరుకున్నారు. ఈ మేరకు సీఆర్‌పీఎఫ్ అధికార లాంఛనాలతో సోమవారం తోలాపిలో అంత్యక్రియలు నిర్వహించారు.

మద్యం తరలిస్తుండగా ఇద్దరి అరెస్ట్


పట్టుబడిన మద్యం బాటిళ్లతో కాశీబుగ్గ పోలీసులు

పలాస, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద సోమవారం రాత్రి వాహనాల తనిఖీ సమయంలో బైక్‌పై 47 క్వార్టర్, 15 ఫుల్ బాటిళ్ల మద్యాన్ని ఇద్దరి వ్యక్తులు తరలిస్తుండగా వారిని అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ సీఐ పి. సూర్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా.. వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన కర్ని అభిలాష్, నందిగాం మండలానికి చెందిన అతని స్నేహితుడు అంబలి ఠాగూర్ ద్విచక్రవాహనంపై పలాసలో మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి బెల్టు షాపులో విక్రయానికి తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందిరాచౌక్ వద్ద పోలీసులు సాధారణ తనిఖీలు చేస్తుండగా వీరు అనుమానాస్పదంగా ఉండడంతో పట్టుకుని ప్రశ్నించగా అసలు విషయం బయట పడింది. ఈ మేరకు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

76 మద్యం బాటిళ్ల స్వాధీనం

ఎచ్చెర్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పిలి గ్రామానికి చెందిన లక్ష్మి అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో ఎచ్చెర్ల పోలీసులు సోమవారం ఆమెను అరెస్ట్ చేశారు. రూ.14,500 విలువ చేసే 76 బీరు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ చెప్పారు.

వరి చేను కుప్పల దగ్ధంపై ఫిర్యాదు

నందిగాం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కణితివూరులో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తన వరి చేను కుప్పలు దగ్ధం చేశారని గిన్ని మల్లేశ్వరరావు సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. సుమారు రూ.లక్ష విలువైన రెండు ఎకరాల పంట నష్టం వాటిల్లిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడి ఆత్మహత్య

సంతబొమ్మాళి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దండుగోపాలపురంలో అద్దె ఇంట్లో ఉంటున్న వావిలాపల్లి సురేష్ (25) సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.. విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం ఉత్తరావల్లి గ్రామానికి చెందిన సురేష్ మూలపేట పోర్టులో శ్రీ బాలాజీ మెస్ పవర్ సప్లైలో భోజనాలు అందించే వర్కర్‌గా కొద్దికాలంగా పనిచేస్తున్నాడు. మరో ఇద్దరితో కలిసి సురేష్ దండుగోపాలపురంలో ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. సోమవారం ముగ్గురు డ్యూటీకి వెళ్లగా సాయంత్రం సురేష్ రూంకి వచ్చి ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

న్యాయవాది మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి


నిరసన తెలుపుతున్న న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

పాతపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాకు చెందిన న్యాయవాది శేషాద్రిరావు మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఈ సత్యనారాయణ మాట్లాడుతూ.. శేషాద్రి మృతికి కారకులైన వారు ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.గోవిందరావు, రవికుమార్, సుందరరావు, అప్పలనాయుడు, మద్దిల రమణ తదితరులు పాల్గొన్నారు.

80 మందికి వైద్య పరీక్షలు

ఎల్.ఎన్.పేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్యామలాపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సర్పంచ్ బి.లక్ష్మి ఆధ్వర్యంలో జెమ్స్ ఆసుత్రి వైద్యురాలు లిఖిత 80 మందికి ఉచిత వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ రకాల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున నిర్లక్ష్యం చేయవద్దన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యాధులు ప్రబలితే తక్షణం వైద్యులను సంప్రదించాలని సూచించారు. బి.గోవిందరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విష్ణుమూర్తికి అష్టాదశ హారతి



జలుమూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగేశ్వరాలయం క్షేత్రపాలకుడు మహావిష్ణుమూర్తికి సోమవారం రాత్రి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి అష్టాదశ హారతి ఇచ్చారు. ధనుర్మాసం పూజల్లో భాగంగా స్వామికి అభిషేకం చేశారు. అలాగే శ్రీముఖలింగేశ్వర స్వామికి అర్చకులు నక్షత్ర హారతి అందించి ప్రత్యేక పూజలు చేశారు.

వెంకన్న స్వామికి క్షీరాభిషేకం

జలుమూరు (సారవకోట) జనవరి 6: (ఆంధ్రజ్యోతి): చీడిపూడి గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామికి సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. గ్రామస్థులు పేరాడ మోహనరావు, నక్క గోవిందరావు దంపతులు 500 లీటర్ల ఆవుపాలను అందించగా అర్చకులు అభిషేకించారు. ధనుర్మాసం సందర్భం గా ఈ కార్యక్రమం చేపట్టినట్లు అర్చకులు తెలిపారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కొయ్యబొమ్మల తయారీదార్లకు అభినందన

హరిపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌లో మందస మండలం చినబరంపురం కొయ్యబొమ్మల స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచినట్లు ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. బజారుకు వచ్చిన సందర్శకులు, కొను గోలుదారులు ఈ స్టాల్‌ను సందర్శించి కొనుగోలు చేశారన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, డీఆర్‌డీఏ పీడీ కిశోర్‌కుమార్, ఐటీడీఏ ఏడీఏ సన్యాసిరావు, తారక మోహన్, స్వామి నాయుడు తదితరులు ఈ స్టాల్‌ను సందర్శించి మహిళలను అభినందించారన్నారు.

నర్సిపురంలో వెలిగిన వీధి లైట్లు

కాశీబుగ్గ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గ మునిసిపాలిటీ నర్సిపురంలో నెలకొన్న సమస్యలపై స్థానికులు ఇటీవల ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందించారు. ఆమె తక్షణం స్పందించి రెండు రోజుల్లో గ్రామంలో వీధి లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం గ్రామంలో మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది వీధి లైట్లను ఏర్పాటు చేశారు. వీధి లైట్లు, రోడ్లు, మురుగు కాలువల సమస్యలను ఆమె దృష్టికి స్థానికులు తీసుకురాగా తక్షణం వీధి లైట్లు ఏర్పాటు చేయడంతో వారు ఎమ్మెల్యే శిరీషకు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగ పింఛన్ లబ్ధిదారుల వివరాల పునఃపరిశీలన

హిరమండలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారుల వివరాలు పునఃపరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో కాశీప్రసాదరావు తెలిపారు. సోమవారం హిరమండలంలో పక్షవాతం, తీవ్ర అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమిత మైన వారి వద్దకు వైద్య బృందంతో కలిసి వెళ్లి వివరాలు సేకరించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ దివ్యాంగ పింఛనుదారులకు సంబంధించిన వైకల్యం వివరాలను వారి ఇళ్లకే వెళ్లి పరిశీలిస్తున్నామన్నారు. పింఛన్‌దారులు సహకరించాలని కోరారు. అనర్హులుంటే వారి జాబితాలకు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

జీడి కార్మికుల సమస్యలు పరిష్కరించండి

పలాసరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో సుమారు 250 జీడి పరిశ్రమ లున్నాయని, వాటిలో పనిచేస్తున్న వేలాది కార్మికుల సమస్యలు పరిష్కరించాలని క్యాష్యూ లేబర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కల్యాణ చక్రవర్తిని కలిసి వినతిపత్రం అందించారు. కార్మికులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు, కార్మిక చట్టాలు అమలు కావడం లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పరిశ్రమల్లో ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ అమలు కావడం లేదని దీంతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం తగు చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో క్యాష్యూ లేబర్ అసోసియేషన్ సభ్యులు శిష్టు గోపి, అంబటి ఆనందరావు, బమ్మిడి సంతోష్ కుమార్, బాలయ్య, పి.ప్రకాశ్ ఉన్నారు.


పలాస రూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ నేతలు

రైస్‌మిల్లు ధూళితో మామిడి పంటకు నష్టం

టెక్కలి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రావివలస రెవెన్యూ పరిధి భగవాన్‌పురంలో స్థానికంగా ఉన్న రైస్‌మిల్లు నుంచి వచ్చిన దుమ్ము, ధూళితో సుమారు వంద ఎకరాల మామిడి తోటలు పాడవుతున్నాయని గ్రామస్థులు మన్నేల సింహాచలం, పొన్నాడ వెంకటరమణ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'మీ కోసం'లో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తిని కలిసి వినతిపత్రం అందించారు. ఇదే విషయమై గతంలో ఫిర్యాదు చేయగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు వచ్చి పరిశీలించారు తప్ప ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తగు చర్యలు తీసుకుని న్యాయంచేయాలని వారు కోరారు. టెక్కలిలో సంక్రాంతి నాలుగు రోజుల పాటు రోడ్ల పక్కన పాత జాగాల్లో తోపుడుబండ్లు పెట్టుకుని అమ్మకాలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఆ సంఘ ప్రతినిధులు మాధవరావు, రజని, మిన్నారావు తదితరులు కోరారు. అలాగే సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు ఎప్పటిలాగే పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఆర్డీవో అసహనం వ్యక్తం చేశారు. అధికారుల అనుమతి లేకుండా గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బలవంతపు భూసేకరణకు పాల్పడితే పోరాటం

పలాసరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా బలవంతపు భూసేకరణకు పాల్పడితే పోరాటం ఉధృతం చేస్తామని వామపక్ష నేతలు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వేణు, న్యూడెమోక్రసీ నాయకుడు మద్దిలి రామారావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో సముద్ర తీరానికి ఆనించి ఉన్న 20 గ్రామాల ప్రజలకు సంబంధించిన భూములను ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ప్రణాళికలు అమలు చేస్తున్నారని, ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి ముసుగులో సముద్ర తీర ప్రాంతాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తే ఉద్యమం ఉధృతం చేస్తామ న్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గణపతి, కె.కేశ వరావు, మహిళా నాయకులు పి.కుసుమ, సుశీల, శ్రీదేవి పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

ఆలిండియా పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో గత నెలలో జరిగిన ఆల్ ఇండియా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో దేశవానిపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనపరిచనట్లు హెచ్‌ఎం జయరావు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జివ్వాది రాజ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో..

సంతబొమ్మాళి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలో సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కల్లూరి మాధవి విజేతగా నిలిచినట్లు హెచ్‌ఎం కామరాజు తెలిపారు. హుంకుంపేటలో జరిగిన జిల్లాస్థాయి పోటీలో 141 మంది విద్యార్థులు పాల్గొనగా మాధవి ప్రథమ బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలికను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి ప్రతిభ పరీక్షకు విద్యార్థినులకు అర్హత

వజ్రపుకొత్తూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గోవిందపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఎడ్యుకేషనల్ మెరిట్ టెస్ట్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులై రాష్ట్రస్థాయి మెయిన్ పరీక్షలకు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం హరిబాబు తెలిపారు. 7వ తరగతి విద్యార్థినులు పట్టపగలు ప్రణీత, డొక్కరి ప్రత్యూష, సాన ప్రియ మెయిన్స్‌కు అర్హత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినులను గైడ్ టీచర్ ఉమారావును సోమవారం హెచ్‌ఎం, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యలో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ

హిరమండలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యలో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సర్వశిక్షా అభియాన్ ఏపీసీ ఎస్.శశిభూషణరావు అన్నారు. సోమవారం హిరమండలం కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసరాలను పరిలించారు. పది, ఇంటర్ విద్యార్థినుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఉపాధ్యాయినులతో మాట్లాడుతూ.. విద్యార్థినుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎస్.కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ ఏపీసీ శశిభూషణరావు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

టెక్కలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ కుప్పిలి ప్రసన్న అన్నారు. సోమవారం చాకిపల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాల నిరోధంపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు ఎటువంటి కష్టం కలిగినా 100, 1098, 181, 112 హెల్ప్‌లైన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. హెచ్‌ఎం అనూరాధ,కానిస్టేబుల్ ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అవగాహన కలిగిస్తున్న వక్త

న్యూస్ బాక్స్

ముగిసిన గ్రిగ్స్ పోటీలు

పోలాకి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా మబగాం ఉన్నతపాఠశాలలో జరుగుతున్న నియోజకవర్గస్థాయి బాలి, బాలికల గ్రిగ్స్ క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధాకృష్ణ, టీడీపీ నేతలు ఎంవీ నాయుడు, బైరి భాస్కరరావు, స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

కొత్తూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నివగాం హైస్కూల్‌లో 14-17 సంవత్సరాల మధ్య ఉన్న బాల బాలికల ఇంటర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ గ్రిగ్స్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల స్కూల్ డ్రిల్ మాస్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం పూర్తి చేయాలి

మందస, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు ఈనెల 12 నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండల టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ఇంతవరకు 15,200 సభ్యత్వాల నమోదయ్యాయ న్నారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బావన దుర్యోధన, నాయ కులు దాసరి తాతారావు, రట్టి లింగరాజు, టి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల స్థలాల పరిశీలన

పలాసరూరల్,జనవరి 6(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పాత జాతీయరహదారిలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్వాసితుల కోసం అందించనున్న స్థలాల ను సోమవారం తహసీల్దార్ ఎన్.కల్యాణ చక్రవర్తి పరిశీలించారు. మొత్తం నిర్వాసితులకు అందించనున్న ఈ స్థలాన్ని చదును చేయాల్సిన ఉన్నందున తీసుకోవాల్సిన చర్యలపై సర్వేయర్ గిరితో చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

మందస, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఔదార్యం చాటుకున్నారు. రాజుల కాలం నాటి పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరు కోవడంతో వాటి మరమ్మతులకు 2003లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు రూ.25 వేల నగదును అందజేశారు. ఈ మేరకు సదరు పనులను సోమవారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జితేంద్ర ప్రాన్సిస్ సడంగి, చైతన్యగౌడ, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోగా మేరీ కేథ్రిన్

టెక్కలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): టెక్కలి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా మేరీ కేథ్రిన్ బాధ్యతలు చేప ట్టారు. ఈ సందర్భంగా సోమవారం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పీహెచ్‌సీలను తరచూ పర్యవేక్షిస్తూ ఉండాలని, ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని ఆర్డీవో సూచించారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం లేకుండా పనిచేసేలా చూడాలన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

నందిగాం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నందిగాం, కాపుతెంబూరు, కొత్తగ్రహారం పాఠశాలలకు చెందిన ఐదుగురు పేద విద్యార్థినులకు ఎస్‌బీఐ రీజ నల్ మేనేజర్ అబ్దుల్ అసీబ్ అమీర్ సోమవారం సైకిళ్లను పంపిణీ చేశారు. స్థానిక బ్యాంకు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు సామాజిక బాధ్యత కార్యక్రమం (సీఎస్ఆర్) కింద వీటిని అందించామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.